క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయాన్ని గురువారం ఎమ్మెల్యే మేఘారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో పాటు కలిసి వెళ్లిన ఆయన గురువారం ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, కార్యకర్తలు శివ, రవి, భాస్కర్, చిన్న, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



మదనాపురం: మండలంలోని కొన్నూరు పెద్ద తండాలో శ్రీ రామలింగేశ్వర ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. వేద పండితులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 9 మంది బ్రాహ్మణులు మంత్రోచ్ఛన చేయగా.. ఆ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. ఉదయం హోమం, యంత్ర ప్రతిష్ఠ, విమాన గోపుర కలశ స్థాపన, రామలింగేశ్వర ఆంజనేయ విగ్రహాలు, నవగ్రహాలు, ధ్వజ శిల, నాభి శిల స్థాపన, నాగుల ప్రతిష్ఠ, కూష్మాండబేధన, బలి మహా పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు శరత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు జయంతమ్మ, మహేష్ యాదవ్, అచ్యుతారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటు చేసినట్లు చైర్మన్ వీరేశ్ నాయక్ తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక రాజావళి ఉర్సు



అమరచింత: పట్టణంలో వెలసిన రాజావళీ దర్గా ఉర్సు మార్చి 1 నుంచి 3 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. 1న గంధోత్సవం, 2న తాజేచిరాక్, 3న ఖత్మేఖురాన్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉర్సు సందర్భంగా చాదర్ ఊరేగింపుతో పాటు ఆల్‌ఇండియా కృష్ణ, మహేష్ బాబు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

పట్టణంలో నిర్వహించే శ్రీసయ్యద్‌షా రాజావళీ దర్గా ఉర్సులో పాల్గొనాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి దర్గా కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక గురువారం అందించారు. కార్యక్రమంలో ఖాజమైనోద్దీన్, ఇంతియాజ్, రఫీ, అన్సారీ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సురేష్‌కు డాక్టరేట్



వనపర్తి టౌన్: స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సురేష్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది ప్రిన్సిపాల్ సురేష్‌ను శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ కమలాకర్ పర్యవేక్షణలో వృక్షశాస్త్ర విభాగంలో సరళాసాగర్ రిజర్వాయర్ నీటి నాణ్యత, శైవలాల వైవిధ్యత అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ పొందినట్లు ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. సురేష్ డాక్టరేట్ పొందడంపై కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. వెంకట్‌ప్రసాద్, డాక్టర్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం హాజరు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రాములు పేర్కొన్నారు. గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 78 మంది విద్యార్థులకు గాను వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు వారు పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా కళాశాల పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వేణు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

‘రైతు బీమా’తో ధీమా

- అన్నదాతకు ఆర్థిక చేయూత
- మండలంలో 305 రైతు కుటుంబాలకు రూ.15.25 కోట్ల లబ్ధి



పాన్‌గల్ శివారులో నాటుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు (ఫైల్)

పాన్‌గల్: వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాలకు రైతు బీమా పథకం ఆసరాగా నిలిస్తోంది. ఈ తరుణంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యం లోనూ ఈ పథకాన్ని అమలు చేస్తూ బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రస్తుతానికి ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకపోవడం విశేషం. 2018 ఆగస్టు 18 నుంచి ఈ పథకం అమలవుతోంది. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దస్త్రాలు ఉంటే చాలు..

అన్నదాత ఏ కారణం చేతనైనా మృతిచెందితే వారి కుటుంబం వీధిన పడకుండా ఉండేందుకు ఈ పథకం దోహదపడుతోంది. బాధిత కుటుంబానికి రూ.5లక్షల చొప్పున పరిహారం అందుతోంది. అర్హతలు, దస్త్రాలు సరిగ్గా ఉంటే ఎలాంటి చిక్కులు లేకుండా బీమా పరిహారం వారంలోగా నామినీ ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయి. దీన్ని కొనసాగించేందుకు ఇటీవల బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించింది.

అర్హతలు ఇలా..

- ఆధార్ యూఐడీఏ పోర్టల్ అనుసరించి రైతు వయస్సు 16 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఏటా ఆగస్టు 14 నుంచి మరుసటి సంవత్సరం ఆగస్టు 13వరకు పథకం అమలులో ఉంటుంది.
- ఏటా నిర్ణీత సమయంలో రెన్యూవల్ చేసుకోవడం తప్పనిసరి
- నిర్ణీత సమయంలో బీమా నమోదు చేసుకున్న రైతు ఏ విధంగా మరణించినా బాధిత కుటుంబానికి బీమా పరిహారం రూ.5లక్షలు అందుతుంది.
- నామినీ ఖాతాలో బీమా పరిహారాన్ని ఎల్‌ఐసీ జమ చేస్తుంది.

ఏడాది వారీగా రైతు బీమా వివరాలు

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	నిధులు (రూ.కోట్లలో)
2018	29	1.45
2019	34	1.70
2020	66	3.30
2021	62	3.10
2022	73	3.65
2023	41	2.05
మొత్తం	305	15.25

పథకంపై అవగాహన కల్పించాలి



రైతు బీమా పథకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి దరఖాస్తులు చేసుకునేలా వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి. దరఖాస్తు తేదీ వచ్చిన వెంటనే అందజేసే ధ్రువపత్రాలు, బీమా గురించి రైతులకు క్షుణ్ణంగా తెలియపర్చి ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకునేలా సిబ్బంది చూడాలన్నారు.

– కోదండరాములు, రైతుసంఘం నాయకులు, రేమద్దుల

కుటుంబానికి ఆసరా



ప్రభుత్వం అందించే రైతు బీమా పెద్ద దిక్కుగా ఉన్న ఇంటి యజమాని మృత్యువాత పడటంతో ఆ కుటుంబానికి పరిహారం ఎంతో ఆసరాగా నిలుస్తుంది. నా భర్త ప్రమాదవశాత్తుతో చెరువులో పడి మృతిచెందడంతో రైతు బీమా పరిహారం మా బ్యాంకు ఖాతాలో జమ అయింది. పరిహారం డబ్బులు పేద కుటుంబాలకు ఎంతో ఆసరా నిలుస్తుంది.

– మండ్ల అనురాధ, దొండాయిపల్లి

రూ.5 లక్షల సాయం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పథకం కింద 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న రైతులకు ప్రయోజనం పొందే వీలుంది. రైతు అకాల మరణం చెందితే ఆధార్‌కార్డు, మరణ ధ్రువపత్రం, బ్యాంకు ఖాతాతో పాటు నామినీ పత్రాలు అందిస్తే రూ.5 లక్షలు పరిహారం ఖాతాలో జమ అయ్యేలా వ్యవసాయశాఖ విస్తరణాధికారులు ప్రక్రియ చేపడతారు.

– సాజీద్‌రహమాన్, ఏఓ, పాన్‌గల్

పథకాల అమలులో అపోహలు వద్దు



మాట్లాడుతున్న బోయేజ్

కొత్తకోట రూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సంద వెంకటేష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల్లో నాలుగు పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు పెంచడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అదేవిధంగా బుధవారం మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే సబ్సిడీ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయడం హర్షం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి



ఎంపీఓకు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: ఖాళీగా ఉన్న వాటితో పాటు కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు వేగంగా చేపట్టాలని డిమాండ్‌చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ ధర్మాపురం, చంద్రప్పతండా, చింతరెడ్డిపల్లి, కిష్టంపల్లి కొత్త గ్రామ పంచాయతీల్లో సీనియర్ మేట్లుగా పనిచేస్తున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరారు. నాగల్‌కడ్మూర్, సింగంపేట, ఈర్లదిన్నె, మస్తీపురం, మిట్టనందిమళ్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు చేపట్టలేదని, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, బెక్కం కురుమన్న, నిశాంత్, బాలస్వామి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జాతీయ మహాసభలు మార్చి 3 నుంచి 5 వరకు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి హన్మంతు తెలిపారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో గురువారం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో మార్చి 3న 40 వేల మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అదే విధంగా 4, 5 తేదీల్లో డీవీకే, భాస్కర్, నందినగర్ శర్మిష్ఠ, శివరాం ముఖ్య ప్రసంగాలు ఉంటాయన్నారు. పేదల హక్కుల కోసం పోరాడేందుకు సీపీఐ మాస్‌లైన్ పార్టీ జాతీయ మహాసభలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, రాజన్న, సామేలు, కురుమన్న, వెంకటేష్, విజయ్, సత్యం, గౌస్, ఉంద్యాల వెంకటేష్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెరగాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కర్నెతండా, ఆముదంబండతండాలో పర్యటించి ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లోని ఫీల్డ్‌అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో వ్యవసాయ పనులు తక్కువగా ఉంటాయని, ఈ సమయంలో కూలీలు పెద్ద సంఖ్యలో పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఎవరికైనా కూలి డబ్బులు వారి ఖాతాల్లో జమ కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంటు శ్రీనివాసులు, కూలీలు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డా.రామయ్య

పాన్‌గల్: పల్స్ పోలియో కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. ఈనెల 3వ తేదీన నిర్వహించే పోలియో కార్యక్రమంపై గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు సమీపంలోని పోలియో కేంద్రంలో చుక్కలు వేయించాలన్నారు. మండలంలో 4,237 మంది చిన్నారులకు 28 కేంద్రాలలో మూడు బృందాలు, ఒక మొబైల్ టీం ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అధికారులతో సమీక్ష

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీసీ నిర్మాణాలపై నిర్వహించే సమీక్ష సమావేశానికి మండల స్థాయి అధికారులు, జీపీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు ఆయా గ్రామాల పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



పెబ్బేరు రూరల్: హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీహరి, జిల్లా సహాయకార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ నింబంధన ప్రకారం హమాలీలతో 50 కేజీల కంటే ఎక్కువ బరువు మోయించొద్దని, కానీ వ్యాపారస్తుల సౌలభ్యం కోసం చక్కెర, పిండి సంచులు లాంటివి 70 నుంచి 100 కేజీల వరకు బ్యాగులు వస్తున్నాయని, ఆ బ్యాగులు మోసి హమాలీలు అతి చిన్న వయస్సులోనే అనారోగ్య పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

‘ఉపాధి’లో జాప్యం వద్దు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి పథకం కింద ప్రతి గ్రామంలో కనీసం వంద మంది కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. ఇంటి పన్నులు వసూలులో కార్యదర్శులు వేగం పెంచాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని, మొక్కలకు రెండు పూటల నీరందించాలన్నారు. ఎంపీఓ రోజా, ఏపీఓ అక్తర్‌నిసాబేగం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెబ్బేరు రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని బునాదిపురం రహదారిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. పెబ్బేరు మండలం సూగూరుకు చెందిన ఆడెం స్వామి పెబ్బేరులోని ప్రైవేటు ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం రాత్రి గ్రామానికి చెందిన ఫక్రుద్దీన్‌తో కలిసి బైక్‌పై పెబ్బేరు నుంచి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో పెబ్బేరు మండలం చెలిమిళ్లకు చెందిన కేశపాగ సుమన్ బైక్ వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆడెం స్వామి, ఫక్రుద్దీన్‌కు బలమైన గాయాలు కావడంతో వెంటనే పెబ్బేరులోని సరోజిని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఫక్రుద్దీన్‌ను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆడెం స్వామి తండ్రి పెద్ద హనుమన్న ఫిర్యాదు మేరకు గురువారం కేశపాగ సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం నాలుగు నెలలుగా అందడం లేదని, అదేవిధంగా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలంటూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తకోట ఎంఈఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం దోపిడి చేస్తుందని, వేతనంతో పాటు కూరగాయల, గుడ్ల బిల్లులు సక్రమంగా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కోడిగుడ్లకు బడ్జెట్ కేటాయించి, సబ్సిడీ ద్వారా గ్యాస్‌ను సరఫరా చేయాలని కోరారు. కార్మికులకు రెండు జతల కాటన్ దుస్తులు ఇవ్వడంతో పాటు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించి ప్రతి నెల 5వ తేదీన వేతనాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్కూళ్లలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులను ఇచ్చి ప్రొసీడింగ్ కాపీని అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలస్వామి, ఆంజనేయులు, ఖాజాబీ, కవిత, గోపమ్మ, చిన్నమ్మ, పద్మ, మన్నెమ్మ తదితరులు ఉన్నారు.

యూడైస్ వివరాలు నమోదు చేయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న యుగంధర్

పాన్‌గల్: మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన యూడైస్ వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విలీన విద్య (ఐఈ) జిల్లా కోఆర్డినేటర్ యుగంధర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని సందర్శించి యూడైస్ వివరాలు, విద్యార్థుల ఆధార్ గ్యాప్, డ్రాఫ్ బాక్స్ దరఖాస్తులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. అనంతరం మండలంలోని జమ్మాపూర్‌లో పాఠశాల భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బోధన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐఆర్పీ సంతోష్, సీఆర్పీలు, ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



వీపనగండ్ల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తకోట రూరల్: మండలంలోని పామాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయ బృందం పృథ్వీమాధ, నుస్రత్‌బేగం, శరత్‌కుమార్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



పామాపురం ప్రాథమిక పాఠశాలలో..

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని బాలికలు ఘనంగా నిర్వహించారు. బాలికలే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కలెక్టర్‌గా రజిత, డీఈఓగా నందిని, ప్రధానోపాధ్యాయురాలుగా కీర్తన వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజూలాదేవీ, ఉపాధ్యాయులు కవిత తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ‘ఆల’కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుఖేశిని

కొత్తకోట: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని కొత్తకోట మున్సిపాల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని చెక్‌డ్యాంల నిర్మాణాలను దేవరకద్ర నియోజకవర్గంలో ఏర్పాటు చేశామని, అంతే కాకుండా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి దేవరకద్రను ఎంతో అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. జిల్లా ఏ నియోజకవర్గంలో లేని విధంగా దేవరకద్ర నియోజవర్గంలో రెండు మైనార్టీ స్కూళ్లను ఏర్పాటున్నాఇన ఘనత ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్, కౌన్సిలర్లు చీర్ల నాగన్న సాగర్, తిరుపతయ్య, హోటల్ రాములు, ఖాజా, కోఆప్షన్ సభ్యులు వసీం, బీఆర్‌ఎస్ నాయకులు అయ్యన్న, రవీందర్‌రెడ్డి, సాధిక్ తదితరులు ఉన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పెబ్బేరు రూరల్: పదో తరగతి తర్వాత విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సులు ఎంచుకున్నట్లయితే తక్కువ సమయంలో ఉపాధి అవకాశాలు దొరుకుతాయని హెచ్‌ఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు వివరాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు అనిల్‌గౌతం, అర్పత్ మాట్లాడుతూ పదో తరగతి తర్వాత అందరికీ అందుబాటులో అతి తక్కువ ఖర్చుతో పాలిటెక్నిక్ విద్య ఒక బంగారు బాటగా ఉపయోగపడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చితే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంఎస్ విజయ్‌కుమార్, రాజశేఖర్‌గౌడ్, నాగన్న, పీఈటీ ఇందిర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించిన పెబ్బేరు నాయకులు

పెబ్బేరు రూరల్: డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆయనకు అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాములుయాదవ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం నుంచి చిన్నారెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా దివ్యాంగుల కమిటీ కార్యదర్శి రమేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు యాదగిరిగౌడ్, మల్లయ్య, నాయకులు ఖదీర్, రమేష్ నాయక్, గోపాల్‌నాయక్ తదితరులు చిన్నారెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



పెద్దమందడి నాయకులు

వీపనగండ్ల: అన్ని రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో ముందుండే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మండలాభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్ కోరారు. గురువారం ప్రజాభవన్‌లో ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన చిన్నారెడ్డిని శాలువలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో తోడ్పాటును అందివ్వాల్సిందిగా కోరారు.